31నే సామాజిక పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈనెల 31నే పింపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లాలో 2,63,995 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్దిదారులు ఉన్నారని, రూ.112.59 కోట్లు పంపిణీకి ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే గత రెండు నెలల్లో ఏదేని కారణంతో ఫించన్ తీసుకోని వారికి ఈ నెల 3 నెలల పించన్ మొత్తం పంపిణీ చేస్తామన్నారు. అలాగే నవంబర్ 2024 నెలలో జీవిత భాగస్వామి మరణించిన వారికి ఈ నెలలో కొత్తగా ఫించన్ మంజూరు చేశామన్నారు.

వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 2025 జనవరి 10 నుండి 19వ తేదీ వరకు 10 రోజుల పాటు భక్తులకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కొరకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని ఈవో జె.శ్యామల రావు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈవో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. వైకుంఠ ద్వార దర్శనం కొరకు భక్తులు క్యూకైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా భక్తులకు టైంస్లాట్ టోకెన్లు జారీ చేస్తామన్నారు. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను 24న 1.40 లక్షలను ఆన్‌లైన్‌లో విడుదల చేశామన్నారు. సామాన్య భక్తులకు తిరుపతిలోని 8 కేంద్రాలలో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్ల ద్వారా ఆఫ్‌లైన్‌లో టోకెన్లు మంజూరు చేస్తామన్నారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒ గౌతమి, సివిఎస్ఒ శ్రీధర్, సిఇ సత్యనారాయణ పాల్గొన్నారు.

డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో శ్యామలరావు

రిమాండ్‌కు కీచక ప్రొఫెసర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : విద్యార్థిని లైంగికంగా వేధించిన ప్రొఫెసర్ ఉమామహేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తిరుపతి రూరల్ సిఐ చిన్న గోవింద తెలిపారు. తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ వెంకటేశ్వర అగ్రికల్చరల్ యూనివర్సిటీలో క్రాప్ ఫిజియాలజీ హెచ్. ఓ.డి గా ఉమా మహేష్ విధులు నిర్వహిస్తున్నారు. అదే వర్సిటీలో ఫస్ట్ ఇయర్ సెకండ్ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. సెమిస్టర్ బ్యాక్ కావడంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా వేధింపులు ఎక్కువ చేయడంతో బాధితురాలు తల్లి దండ్రులు, సీనియర్ స్టూడెంట్స్ దష్టికి ఆధారాలతో సహా తీసుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుని అదుపులో తీసుకున్నామని, రిమాండ్కు తరలించామని తెలిపారు.

హౌసింగ్ ఇళ్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -రేణిగుంట : చెంగారెడ్డిపల్లి, కుర్రకాల్వ దళిత గిరిజన ఇళ్లను కూల్చివేయడంతో బాధితులకు న్యాయం చేయాలని, మూడు సెంట్ల స్థలం కేటాయించి, హౌసింగ్ ఇళ్లు మంజూరు చేయాలని ఇళ్ల పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. రెండు లక్షల నుంచి నాలుగు లక్షలు అప్పు చేసి ఇళ్లు కట్టుకున్నామని, అక్రమ కూల్చివేతకు ఎంఎల్ఎ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. శనివారం చెంగారెడ్డిపల్లి శ్రీరాములు గుడి వద్ద ఎపి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్ ఆధ్వర్యంలో బాధితులంతా సమావేశమయ్యారు. ఎస్.సత్యశ్రీ, సెల్వరాజ్, ఈశ్వరమ్మ, అంబేద్కర్ నాగరాజు, హరి, లోకేష్, మేమాద్రి పాల్గొన్నారు.

విచిత్ర ధ్వనులకు 'బ్రేక్' : ఎస్పి

ప్రజాశక్తి - తిరుపతి సిటి: ద్విచక్రవాహనాలు 'డబ్ డబ్ డబ్' అని చేసే విచిత్ర ధ్వనులకు ఎస్పి సుబ్బరాయులు బ్రేక్ వేశారు. శనివారం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ప్రాంగణంలో 385 బుల్లెట్ వాహనాలకు సంబంధించిన సైలెన్సర్‌లను రోడ్‌రోలర్ సాయంతో నుజ్జునుజ్జు చేశారు. ఈ ధ్వనుల వల్ల పసిపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు జడుసుకుంటున్నారని, అందువల్లనే ఆగడాలకు బ్రేక్ వేశామన్నారు. అనంతరం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్మెట్ అవగాహన ర్యాలీలో పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. హెల్మెట్ ధరించి ఎస్పి వాహనం నడిపారు. అడిషనల్ ఎస్పీలు వెంకటేశ్వరరావు అడ్మిన్, రవిమనోహరాచారి, ట్రాఫిక్ డిఎస్పి రామకష్ణ ఆచారి పాల్గొన్నారు.

ఆడుతూ పాడుతూ.. ప్రతిభను ప్రోత్సహిస్తూ..

భళా.. బాలోత్సవం..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి సిటి: 'ప్రతిభను ప్రోత్సహిస్తూ.. అభిరుచులకు ఆలంబనగా' ఆడుతూ పాడుతూ బాలోత్సవం ఉల్లాసభరిత వాతావరణంలో వేడుకగా శనివారం ఉదయం ప్రారంభమయ్యింది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి తిరుపతి నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వేదికయ్యింది. జిల్లా నలుమూలల నుంచి హాజరైన వేలాదిమంది విద్యార్థులు తమ కళలను సృజనాత్మకంగా ప్రదర్శించారు. వివిధ వేషధారణలతో అలరించారు. బాలోత్సవం అధ్యక్షులు టెంకాయల దామోదరం అధ్యక్షతన, వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున సారథ్యంలో ఆడుతూ పాడుతూ బాలోత్సవం అలరించింది.

తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించడంతో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిలిపేసి, నివాళి అర్పించారు. ప్రారంభసభకు డిఈవో కెవిఎన్ కుమార్, కస్తూర్బిగాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టరు పిసి రాయల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మొదటిగా డ్రాయింగ్ పోటీలను ప్రారంభించారు. ఒక్క చిత్రలేఖనంలోనే 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వెనువెంటనే వివిధ అంశాల్లో పలు వేదికల ద్వారా పలు రకాల పోటీలు ప్రారంభమయ్యాయి. నెహ్రుమున్సిపల్ హైస్కూల్ ప్రాంగణం మొత్తం ఎటు చూసినా విద్యార్థులతో కిక్కిరిసింది. ఒక పక్క శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, దాన్ని ఆనుకునే దేశభక్తి గీతాలాపనలు, మరో పక్క జానపద కళా ప్రదర్శనలు, ఇంకోపక్క ఏకాపాత్రాభినయాలు, దాన్ని వెనకే వాయిద్యపోటీలు, దానికి సమీపాన ప్యాన్సీడ్రస్ పోటీలు, విశాలమైన మైదానంలో చిత్రలేఖనాలు, వ్యాసరచన పోటీలు. ఇలా ఎక్కడ చూసిన పిల్లల పోటీ కార్యక్రమాలతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. మొదటి రోజు సాయంత్రం ముగింపు సందర్భంగా ఉదయం నుంచి జరిగిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గీతా బాలసుబ్రమణ్యం, నెల్లూరు మునిలక్ష్మీ, తహిషీనా, రఫి, బాలాజీ ప్రసాద్ చౌదరి, తమటం రామచంద్రారెడ్డి, సోము రవికుమార్, నడ్డి నారాయణ, పయ్యావుల గురున్నాథం, పద్మజ, మునిశేఖర్, మోహన్‌మూర్తి, ఓవి రమణ, కెఆర్ఎస్ సుబ్రమణ్యం, ఎంఈవో బాస్కర్ పాల్గొన్నారు. 200 మంది ఈ బాలోత్సవాన్ని విజయవంతం చేసేందుకు నిర్వహణ బాధ్యత తీసుకోవడం గమనార్హం.

ఒత్తిడి దూరం చేసేలా 'ఆటవిడుపు' : కెవిఎన్ కుమార్, డిఇఒ

పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిరంతరం చదువులతో ఒత్తిడికి గురవుతూ ఉంటారని, అలాంటి వారికి ఈ బాలోత్సవం ఆటవిడుపుగా ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి కెవిఎన్ కుమార్ అన్నారు. బాలోత్సవంలో ఎనిమిదివేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను చదువుతో పాటు ఇతరత్రా రంగాల్లోనూ ప్రోత్సహించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. విద్యార్థుల్లో కొత్త కొత్త ఆలోచనలు రేకెత్తిస్తాయని, దీంతో పిల్లలు మరింత విజ్ఞానాన్ని పెంచుకుని, అటు చదువుల్లోనూ... ఇటు ఆసక్తిగల రంగాల్లోనూ రాణిస్తారని తెలిపారు.

బడి పాఠాలే కాదు

టెంకాయల దామోదరం, గౌరవాధ్యక్షులు

పిల్లలకు కేవలం బడి... పాఠాలే కాదు వారి నైపుణ్యతను, సజనాత్మకతను గుర్తించి, మరింత చేయూతనిచ్చే కార్యక్రమం తిరుపతి బాలోత్సవం. మూడోసారి తిరుపతి వేదికగా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి దాదాపు 8వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సంఘీభావ కార్యక్రమం వారి మానసిక వికాసానికి దోహదపడుతుంది.

ఓ సృజన వేదిక

నడ్డి నారాయణ, అధ్యక్షులు

నేటి సమాజంలో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాట వేసే తిరుపతి బాలోత్సవం ఓ సజన వేదిక. చిత్రలేఖనం పోటీల్లో పిల్లలు అద్భుతమైన చిత్రాలను గీసి అబ్బురపరిచారు. తిరుపతి బాలోత్సవం పోటీల్లో పాల్గొనాలని పది రోజులకు ముందు నుండి సెల్ఫోన్‌లను పక్కనపెట్టి పోటీల్లో రాణించడానికి విద్యార్థులు శ్రమించారని వారి తల్లిదండ్రులు చెప్పారు.

శాస్త్రీయ ఆలోచనలు వికసిస్తాయి

మల్లారపు నాగార్జున, వ్యవస్థాపకులు

తిరుపతి బాలోత్సవం వేదికగా నిర్వహించే కార్యక్రమాలు పిల్లల్లో శాస్త్రీయ ఆలోచనలు వికసించడానికి దోహదపడతాయి. జానపద నత్యాలు, బొమ్మకు కథ, చదరంగం వంటి అంశాలు పిల్లల్లో వారి ఆలోచన, మెదడు మరింత వికసించడానికి ఉపయుక్తంగా ఉంటాయి. ఈ నవ సమాజానికి తిరుపతి బాలోత్సవం బీజం వేసింది.

అంచనాలను మించి ప్రతిభ చూపారు

మోహనమూర్తి, కార్యనిర్వాహకులు

వివిధ పోటీల్లో పిల్లలు అంచనాలను మించి ప్రతిభ చూపారు. ప్రతి పోటీల్లో పిల్లలు తమ నైపుణ్యతను చాటడానికి ఉత్సాహం చూపించడం మాకు సంతోషం కలిగించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు రెండు విధాలుగా బహుమతి ప్రదానం చేయాలని నిర్ణయించాం. విద్యార్థుల ఆలోచన శక్తి తిరుపతి బాలోత్సవం ఖచ్చితంగా పెంచుతుంది.



వినూత్న ఆలోచనకు వేదికయ్యింది

నెల్లూరు మునిలక్ష్మి, కార్యనిర్వాహకురాలు

తిరుపతి బాలోత్సవం పిల్లల్లో వినూత్న ఆలోచన కలిగించింది. ఈ పోటీ ప్రపంచంలో ఇటువంటి కార్యక్రమాల ద్వారా పోటీ ఎదుర్కొనే శక్తిని విద్యార్థులు కూడగట్టుకోగలుగుతారు. ఇన్ని వేలమంది ఎంతో ఉత్సాహంగా బాలోత్సవం పిల్లల పండుగలు పాల్గొని వారి నైపుణ్యతను పెంచుకున్నారు. పిల్లల మానసిక ఎదుగుదలకు తిరుపతి బాలోత్సవం ఉపకరిస్తుంది.

అందాల పోటీల్లో పాదిరేడు యువతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: జాతీయ స్థాయి అందాల పోటీలు 2024లో వడమాలపేట మండలం పాడిరేడుకు చెందిన అల్లూరు సుజన మిస్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్ అవార్డును దక్కించుకున్నారు. ఈనెల 21న న్యూఢిల్లీ పశ్చిమ విహార్ హోటల్లో జాతీయస్థాయి అందాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సుజన ఫస్ట్‌రన్నరప్‌గా నిలిచారు. సుజన కలికిరి జెఎన్‌టియూలో గ్రాడ్యుకేషన్ పూర్తి చేశారు. కాగ్నిజెంట్ సంస్థలో ఉద్యోగావకాశం వచ్చినట్లు ఆమె చెప్పారు. తల్లిదండ్రులు విశ్రాంత ఉపాధ్యాయురాలు పార్వతి, సెరికల్చర్ ఆఫీసర్ సుబ్రమణ్యం. వారి ప్రోత్సాహంతోనే తనకు ఈ అవార్డు దక్కిందని ఆమె 'ప్రజాశక్తి'కి తెలిపారు.

50 రోజుల్లో రూ.55 లక్షల విరాళం

ప్రజాశక్తి- తిరుమల : టీటీడీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.1 నుండి రూ.లక్షలోపు విరాళం ఇవ్వదలచిన భక్తుల కోసం సులభతరంగా విరాళం ఇచ్చేందుకు వీలుగా తిరుమలలోని శ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో కియోస్క్ మిషన్లు(సెల్ఫ్ ఆపరేటెడ్ ఆన్ లైన్ పేమెంట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మిషన్ల ద్వారా అన్న ప్రసాదం ట్రస్టుకు 50 రోజుల్లో రూ.55 లక్షలు విరాళం అందింది. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, ఒంటిమిట్ట కోదండ రామాలయం, బెంగుళూరులో శ్రీవారి ఆలయంలో కూడా ఈ మిషన్లు ప్రారంభించారు. ఈ మూడు ఆలయాల్లో ఈ మిషన్ల ద్వారా 15రోజుల్లో రూ.5 లక్షలు విరాళంగా అందింది.

రాజ్యాంగ హక్కులపై ఉద్యమిద్దాం

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

సదస్సులో ప్రసంగిస్తున్న జాతీయ నాయకులు సాను

ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జెండావిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్: దేశంలో నానాటికి అడుగంటి పోతున్న రాజ్యాంగ హక్కుల కోసం మరొక దేశ వ్యాప్త పోరాటం అవసరమని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి. సాను పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ప్రకాశం భవనం ఎదుట జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆర్ట్స్‌బ్లాక్ ఆడిటోరియంలో 'ప్రాథమిక హక్కులు, లౌకిక సామ్యావాద విలువలు' అంశంపై రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షులు అక్బర్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. దేశంలో రాజ్యాంగ విలువలు ఉల్లంఘిస్తూ దాడులు పెద్దఎత్తున పెరిగాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్దఎత్తున డ్రాపౌట్ అవుతున్నారన్నారు. మోడీ ప్రభుత్వ నూతన విద్యా విధానం అసమానతలు సృష్టించి, బడుగులకు విద్యను మరింత దూరం చేసిందన్నారు. జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ అందరికీ రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వం లభించినప్పుడే రాజ్యాంగం పరిపూర్ణత సాధిస్తుందన్నారు. నేటి విద్యార్థులు ఆ రాజ్యాంగం హక్కులు కోసం పరితపించాలని అన్నారు. మాజీ జిల్లా కార్యదర్శి మాధవ కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, అశోక్, తేజ, సహాయకార్యదర్శి బాల, సుష్మిత, వీరేష్ పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-తిరుపతి సిటి: వేలాది మందికి ఉపయోగకరంగా నూతనంగా ఏర్పాటు చేసిన తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌లోని డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని సిపిఎం నాయకులు డిమాండు చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో డిబిఆర్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను సిపిఎం నాయకులు సందర్శించారు. కొత్తగా నిర్మాణంలో ఉన్న ఫైఫ్లోర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ పేదలు నివశిస్తున్న కొర్లగుంట ప్రాంతంలో వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ చుట్టుపక్కల సుమారు ఆరేడు కిలోమీటర్ల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేకపోవడంతో ప్రయివేట్, కార్పొరేట్ కాలేజీలను ఆశ్రయించాల్సి వస్తోంది. కొత్తగా నిర్మించిన డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ కార్పొరేషన్ స్కూల్‌లో దాదాపు 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. 10వ తరగతి పూర్తయిన తర్వాత ఈ పేద విద్యార్థులు ప్రయివేట్ కాలేజీల్లో చదువుకునే స్తోమత లేదన్నారు. పేద విద్యార్థుల అవసరాల రిత్యా ప్రభుత్వం ఈ హైస్కూల్‌ను జూనియర్ కాలేజీగా ఏర్పాటు చేయాలన్నారు. సిపిఎం నాయకులు పి.బుజ్జి, ఎం.నరేంద్ర, పి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

స్కూలును సందర్శించిన సిపిఎం నాయకులు

'నిర్మాణ'దక్షుడు

స్వామి సేవలో ఎంతో సంతృప్తి

'ప్రజాశక్తి'తో టిటిడి ఇఇ జివి.కృష్ణారెడ్డి

మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో..

ప్రజాశక్తి-తిరుపతి సిటి

'దేశవ్యాప్తంగా ఎన్నో నిర్మాణాలు చేపట్టాను.. 2007-08లో రాజంపేట సమీపంలోని అన్నమయ్య స్వగ్రామంలో టిటిడి ఏర్పాటు చేసిన 108 అడుగుల విగ్రహ స్థాపన పనులు, చుట్టుపక్కల పచ్చదనాన్ని పెంచే పనులు అత్యంత వేగంగా కేవలం 108 రోజుల్లోనే పూర్తి చేయడం అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ అవార్డును అందుకునేలా చేసింది. 36 సంవత్సరాల పాటు శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తులకు సేవ చేశాను. అయితే స్వామి సన్నిధిలో చేసిన నిర్మాణాలు ఎంతో సంతృప్తినిచ్చాయి.. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నాను.' అని తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోన వెంకట కృష్ణారెడ్డి చెప్పారు. ఆయన జీవిత విశేషాలు, స్వామి సన్నిధిలో ఆయన చేసిన సేవలు ఆయన మాటల్లోనే..

మాది ఉమ్మడి కడప జిల్లా జమ్మలమడుగు. జి.సుబ్బారెడ్డి, జి.సుబ్బమ్మ దంపతులకు 1962, డిసెంబర్ 25న మూడో సంతానంగా పుట్టాను. మా తండ్రి ప్రధానోపాధ్యాయుడు. ముగ్గురు పిల్లల్ని క్రమశిక్షణతో, మానవీయ విలువలతో, సేవా దృక్పధాన్ని పెంపొందించి పెంచారు. బిటెక్ సివిల్ ఇంజినీరింగ్ చదివాను. నా సతీమణి జి.శారద. నా విధి నిర్వహణలో ఎటువంటి టెన్షన్ లేకుండా నా వెన్నంటి నిలిచారు. కుమార్తె మృదులరెడ్డి, అల్లుడు జగదీశ్వర్‌రెడ్డి, కుమారుడు స్వదీప్‌రెడ్డి, కోడలు క్రిషితేజ సాఫ్ట్‌వేర్ రంగంలో అమెరికాలో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మనవరాళ్లు కైరారెడ్డి, మోక్షరెడ్డి నా ప్రియమైన నేస్తాలు.

ప్రతి కట్టడంలోనూ తనదైన 'ముద్ర'

1989లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా టిటిడి సంస్థల్లో ఉద్యోగం వచ్చింది. తొలి పోస్టింగ్ కరీంనగర్‌లో. 1990లో తిరుమలకు బదిలీపై వచ్చారు. తిరుమలలో త్రీ ఎంఎల్‌డి ఫిల్టరేషన్ ప్లాంట్‌ను నిర్మించడంలో కీలకంగా వ్యవహరించారు. 1993-94లో తిరుపతి డిజైనింగ్ సెల్‌లో, 1994లో ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా న్యూఢిల్లీకి బదిలీపై వెళ్లారు. 1996లో మళ్లీ తిరుపతికి వచ్చి స్విమ్స్‌లో క్వార్టర్స్, హాస్టల్స్, బిటి రోడ్ల నిర్మాణం, ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో పలు అంతస్తుల నిర్మాణం చేపట్టాం. 2001-02లో తిరుమలలో మోడరన్ క్యూ కాంప్లెక్స్, కిచెన్, డైనింగ్‌హాలు, వేదిక్ స్కూల్ నిర్మాణం చేశారు. తిరుమల తిరుపతిలోని పలు నిర్మాణాల్లో తన భాగస్వామ్యం ఉండటం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ఢిల్లీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, లైబ్రరీ నిర్మాణం చేశారు. 2006-07లో డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2008-09 మధ్య ఈఈ-3గా అమ్మవారి మాస్టర్‌ప్లాన్, మాఢవీధుల ఆధునీకరణ, తిరుచానూరు, తుమ్మలగుంట రోడ్లను అభివృద్ధి చేశారు. తిరుచానూరు నుంచి వార్తా కార్యాలయం వరకు సిసి రోడ్డు, రామానూజ సర్కిల్ వరకు రోడ్డు నిర్మాణం, టిటిడి సత్రాలు నిర్మాణాలు జరిగాయి. ముఖ్యమంత్రి చేతులమీదగా ఉత్తమ ఇంజనీర్ అవార్డు, 1999, 2010లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, 2014, 2021లో రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగి అవార్డులను స్వీకరించారు.

కుటుంబ సభ్యులతో జివి కృష్ణారెడ్డి

విద్యుత్ బాదుడుపై 'పోరు'బాట

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ప్రభుత్వాలు మారినా... పాలకులు మారినా... ప్రజలపై భారాలు తప్పడం లేదు. నిత్యావసర వస్తువుల బాదుడు భయంకరంగా ఉంటోంది. తాజాగా కరెంట్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రభుత్వం వేల కోట్ల దోపిడీకి తెరలేపింది. విధిలేని పరిస్థితుల్లో వామపక్షాలు విద్యుత్ ఛార్జీల భారంపై నినదించాయి. తాజాగా వైసిపి సైతం 'పోరుబాట' పట్టింది. అయితే వైసిపి హయాంలోనూ సర్దుబాటు ఛార్జీల భారం మోపడంతో కూటమి విమర్శలను ఆ పార్టీ ఎదుర్కోవాల్సి వస్తోంది.

సమాజంలో ప్రతి ఒక్కరికీ కరెంట్ అవసరం తప్పనిసరి. ఇళ్లల్లో వెలుగులు రావాలన్నా, యంత్రాలు పని చేయాలన్నా విద్యుత్ ఎంతో కీలకం. మానవ జీవితంలో ఆహారానికంటే అతి ముఖ్యమైనదిగా నిలుస్తోంది. కరెంట్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికల్లో టిడిపి కూటమి హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి రాగానే మాట తప్పి రూ.15,484 కోట్ల రూపాయలు సర్దుబాటు ఛార్జీల భారం వేశారు. డిసెంబరు నెల నుంచి కరెంటు చార్జీలు దొడ్డిదారిన పెంచేశారు. రెండేళ్ల క్రితం (2022-23) వాడుకున్న కరెంటుకు అనాడు బిల్లు కట్టినా, మళ్లీ అదనంగా సర్దుబాటు చార్జీల పేరుతో 6072 కోట్ల రూపాయల భారాన్ని జనంపై ఇప్పుడు వేశారు. జనవరి నుంచి మరో 9,414 కోట్ల రూపాయల భారం మోపటానికి రంగం సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 6 నెలల్లోనే ప్రజలపై కరెంట్ చార్జీల పేరుతో 15,486 కోట్ల రూపాయల భారం వేయడం శోచనీయం. విద్యుత్ ఉత్పత్తి మొదలు పంపిణీ వరకు బడా కంపెనీలకు కట్టపెట్టడానికి కేంద్రం చట్టసవరణలు చేస్తోంది. రాష్ట్రాలకు అప్పుల ఎర చూపి లొంగదీసుకుంది. మన రాష్ట్రంలో ఏడు మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఒప్పందాలను అధిక రేట్లకు మోడి, జగన్ ప్రభుత్వాలు అడ్డగోలుగా చేసుకున్నాయి. 1750 కోట్ల రూపాయలు గత ప్రభుత్వ పెద్దలకు అదాని లంచాలిచ్చి ఒప్పందాలు చేసుకున్నట్లు అమెరికా కోర్టుల్లో సాక్ష్యాధారాలతో వెల్లడైన విషయం విదితమే. ఈ ఒప్పందం ద్వారా రాబోయే 25 ఏళ్లలో లక్ష కోట్ల రూపాయలు అదనపు భారం ప్రజలపై పడనుంది. ఇప్పుడు పెంచిన ట్రూ అప్ చార్జీలు అవినీతి సామ్రాట్ అదానికి కట్టబెట్టడానికే అయినా దీనిపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నోరు మెదపటం లేదు. విచారించి శిక్షించాల్సింది పోయి... అదాని, జగన్ మోడీని కూటమి ప్రభుత్వం కాపాడుతుండం గమనార్హం.

126 మంది ఉద్యోగాలకు ఎంపిక

జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 126 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు జి కోటేశ్వరయ్య, వి వీరయ్య తెలిపారు. డిగ్రీ కళాశాలలో జేకేసి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 165 మంది పాల్గొనగా అందులో 126 మంది విద్యార్థులకు సంబంధిత కంపెనీ వారు ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఇందులో పుత్తూరు డిగ్రీ కళాశాల విద్యార్థులు 86 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం పై పట్టు కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించింది. ఈ కార్యక్రమంలో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి బాబు రావు, డాక్టర్ సుజనా, టి కిశోర్, డాక్టరు పి హరిబాబు, డాక్టరు సివెంకటకృష్ణయ్య, డాక్టరు పి శంకర రావు, డాక్టరు టి రఘురాం, ఇతర బోధన , బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మినిగోకులం షెడ్లు తనిఖీలో ఉపాధి పీడీ

ప్రజాశక్తి - పిచ్చా టూరు: ప్రభుత్వం చేపట్టిన మినిగోకులం షెడ్లు పథకాన్ని ప్రతి పేద రైతు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి పీడీ శ్రీనివాస ప్రసాద్ పేర్కొన్నారు. పిచ్చాటూరు మండలంలో ఉపాధి పీడీ మినీ గోకులం షెడ్లను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రైతులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చేపట్టిన మినిగోకులం షెడ్లు పథకాన్ని ప్రతి పేద రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ రాజు, ఏపీడీ సరిత, ఏపీవో నాగభూషణమ్మ, పీఆర్ఏఇ తేజ, జేఇ ఈశ్వర్, టెక్నికల్ అసిస్టెంట్ పుష్పరాజ్, ధనంజయులు పాల్గొన్నారు.

సిసి రోడ్ల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు ఇందిరా నగర్‌లో కొనసాగుతున్న సిసి రోడ్ల నిర్మాణ నాణ్యతను ఉపాధి పీడీ శ్రీనివాస్ ప్రసాద్ శనివారం పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026, 2027 కల్లా ప్రతి గ్రామాల్లో సిమెంట్ రోడ్లు పూర్తి కావాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్దు రాజు, రవి రెడ్డి, చిన్న , వాసు, ఢిల్లీ బాబు, దొరవేలు, ఏసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనాలు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జెవివి ఆధ్వర్యంలో ఓం సాయిరాం చారిటీస్ వృద్ధుల ఆశ్రమంలో యూఎస్ఏలో నివసిస్తున్న జెవివి గౌరవ అధ్యక్షులు పురుషోత్తమరావు అల్లుడు వి నరేష్ పుట్టినరోజు సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేశారు. అమెరికాలో ఉంటూ అక్కడ పుట్టినరోజు జరుపుకున్నా గానీ మేము ఇక్కడ నివసిస్తూ వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేయటం చాలా సంతోషంగా ఉందని, తమ అల్లుడు ఎప్పుడూ ప్రజలకు సహాయం చేస్తూ మంచి స్థాయిలో ఉండాలని ఆశిస్తున్నామన్నారు. జెవివి ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా వున్నారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, విశాలాక్షి, రాధమ్మ, గుర్రం విజయబాబు, ప్రభాకర్, సుబ్బారావు, ఇబ్రహీం, శ్రీనివాసులు, ఆశ్రమ కార్యనిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి: సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు: గిరిజనులకు ఇంటి స్థలాలు, సాగు భూములు కేటాయించాలని సత్యవేడు మండల సిపిఎం కార్యదర్శి మెలుగు రమేష్ మదనంబేడు లో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గిరిజనుల తరపున తహశీల్దారుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి,మాజీ మండలాధ్యక్షులు పరమశివం హాజరయ్యారు. గ్రామ లెక్క దాకలలోని 126/1 సర్వే నెంబర్ల తన అనుభవంలో ఉన్న 80 సెంట్ల సాగు భూమికి అనుభవ పట్టా ఇవ్వాలని మదనంబేడు గ్రామ దళితవాడకు చెందిన ఎం సెల్వి, మునుస్వామి వినతిపత్రం సమర్పించారు.

టీటీడీకి రూ.5 లక్షల సేంద్రియ ఎరువులు విరాళం

ప్రజాశక్తి -తిరుమల: తిరుపతికి చెందిన క్రియాజన్ అగ్రీ అండ్ బయోటెక్ కంపెనీ వారు టీటీడీ అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉన్న అటవీ, ఉద్యానవన సంరక్షణకు రూ. 5 లక్షల విలువ గల 20 టన్నుల సేంద్రియ ఎరువులు విరాళంగా అందించింది. సేంద్రియ ఎరువులను ఉప అటవీ సంరక్షణ అధికారి శ్రీనివాస్ కు తిరుపతిలోని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య చేతుల మీదుగా తిరుపతి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మనోహర్ బాబు, అగ్రికల్చరల్ ఆఫీసర్ ప్రపూర్ణ, కంపెనీ సిబ్బంది జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అందించారు.

కార్యకర్త కుటుంబానికి బృందమ్మ పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ మాజీ పట్టణాధ్యక్షుడు డాంగే కుటుంబాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ శనివారం పరామర్శించారు. డాంగే సతీమణి పద్మావతి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా పద్మావతి చిత్ర పటానికి బృందమ్మ నివాళి అర్పించారు. డాంగే, కిట్టు కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పోలీస్ కార్యాలయాన్ని పరిశీలించిన డీజీపీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి తిరుమల పర్యట నిమిత్తం శనివారం తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావుకు ఘన స్వాగతం లభించింది. అనంతరం రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతికి చేరుకున్న ఆయన నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని, రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీని జిల్లా ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి పరిశీలించారు. పనుల ఆలస్యం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు : ఈఈ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో వినియోగ దారులు సెలవు దినం ఆదివారం కూడా విద్యుత్ బిల్లుల కౌంటర్లు తెరిచి ఉంటాయని టౌన్ డివిజన్ ఈఈ చిన్న కోటి చంద్ర శేఖర్ రావ్ తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో కట్టకుండ వేసుకుంటూ ఉండేలా ఏర్పాటు చేశారని వెల్లడించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాగులో చిక్కుకున్న ఆటో

కాపాడిన యువత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని యార్లపూడి– పల్లంపేట ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న పాతగుంట వాగును దాటుతూ ఓ ఆటో వరదలో చిక్కుకున్న ఘటన ఆలస్యంగా శనివారం వెలుగు చూసింది. అటుగా వెళుతున్న యువత గుర్తించి ఆటోలో ఉన్న పది మంది ప్రయాణికులను ప్రాణాలతో రక్షించారు. వీరిలో ముగ్గురు స్కూల్ పిల్లలు కూడా ఉండడం గమనార్హం. యార్లపూడి–పల్లంపేట గ్రామాలకు సుమారు ఐదు గ్రామాల వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరు పాతగుంట వాగును దాటి గమ్యానికి చేరుకోవాల్సి ఉంటుంది. అయితే వర్షాలు పడ్డ ప్రతిసారి ఇక్కడ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగును దాటేందుకు తక్కువ ఎత్తుతో కల్వర్టును నిర్మించడంతో మోస్తారు వర్షాలకు కూడా కల్వర్టు పై నీరు ప్రవహిస్తోంది. వర్షాకాలమైతే వాగు ఉధృతిని చెప్పలేని పరిస్థితి. వర్షాలు తగ్గుముఖం పట్టినా వాగు కారణంగా కనీసం పదిరోజులైనా అవతలి గ్రామాలకు రాకపోకలు బంద్. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో వాగు ఉధృతిని అంచనా వేయని ఓ డ్రైవర్ ఆటోను కల్వర్టుపై పోనిచ్చాడు. దీంతో వరద నీటి వేగానికి కొద్ది దూరం కొట్టుకు పోయింది. ఆటోలోని ప్రయాణికులు కాపాడాలని కేకలు వేయడంతో అటుగా వెళుతున్న పాతగుంట గ్రామానికి చెందిన భూపతి అనిల్ కుమార్ తన స్నేహితుల సహాయంతో ఆటోను, అందులో ప్రయాణిస్తున్న వారిని ఒడ్డుకు చేర్చారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమకీ సాహస ప్రయాణాలుండవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఎగ్జిక్యూటివ్ కోటా పిహెచ్‌డీ అడ్మిషన్లకు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎగ్జిక్యూటివ్ కోటాలో పిహెచ్‌డీ లో చేరాలనుకున్నవారు 21 జనవరి 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మారాల భూపతి నాయుడు తెలిపారు. వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌వియు యూనివర్సిటీ.ఇడియు.ఇన్/డీఈవో. వెబ్‌సైట్‌ను చూడవచ్చన్నారు.

ఘనంగా అన్నా అనిత యాదవ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరపాలక సంస్థ కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్ జన్మదిన వేడుకలను శనివారం జీకేనగర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు సికె రేవతి, కల్పన, నారాయణ, బీజే కృష్ణ యాదవ్, దంపుల భాస్కర్ యాదవ్, శరవ గోహన్ అన్నా అనిత యాదవ్‌ను శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు అన్నా రామచంద్రయ్య, రఘ హిందుస్తాన్, శంకర్ యాదవ్, కోర్లగుంట ముని, ఉదయ్ యాదవ్ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న నాయకులు

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : వెరిటాస్ సైనిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు చిత్తూరు అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. స్థానిక వెరిటాస్ ఆఫ్ సైనిక్ స్కూల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్న స్కూల్ నిర్వాహకులను ఆయన అభినందించారు. సుమారు 16 క్రీడ అంశాలలో గెలుపొందిన వారికి ప్రశంస పత్రాలతో పాటు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ డైరెక్టర్ శ్రీకర్ రెడ్డి, సిజిహెచ్ ఖాన్, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

31న సామాజిక భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరానికి ముందే ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లాలో 2,63,995 మందికి 112.59 కోట్ల రూపాయలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

ఉమామహేష్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి

- ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నారాయణ గౌడ్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి ఎస్‌వి వ్యవసాయ కళాశాలలో మహిళా విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన క్రాప్ ఫిజియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కళాశాల అసోసియేట్ డీన్ ఎంవి రమణకు ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు నీతి వాక్యాలు బోధించాల్సిన అధ్యాపకుడు ఉమా మహేష్ బిఎస్సి అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. విద్యాబుద్ధులు నేర్పించి సంస్కారం నేర్పించవలసిన గురువు విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటు అన్నారు. అధ్యాపక వృత్తికి కళంకం తెచ్చే ఇలాంటి అధ్యాపకుల వల్ల రాష్ట్రంలో విశ్వ విద్యాలయాల్లో, కళాశాలలో అధ్యాపకుల వృత్తికి గౌరవం తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అతన్ని విధుల నుండి తొలగించి సస్పెండ్ చేయాలనీ, భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు.

నిర్లక్ష్యం వల్లే భూ సమస్యలు అధికం

- రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సిపిఎం డిమాండు

ప్రజాశక్తి -కేవిబిపురం: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రైతుల భూ సమస్యలు ఏళ్లతరబడి పేరుకుపోయాయని, రెవెన్యూ సదస్సుల్లో వాటికి పరిష్కారం చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి డిమాండు చేశారు. రైతుల భూ సమస్యలపై రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరి– పరిష్కారానికి అనుసరించాల్సిన వ్యూహంపై పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబిపురం మండల సిపిఎం నాయకుల సమావేశం శనివారం రామచంద్రారెడ్డి అధ్యక్షతన కెవిబిపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం కాక తరాలు గడుస్తున్నా తాతలు, తండ్రులు మరణిస్తున్నా వారి వారసుల పేరు మీద భూములు నమోదు చేయడంలో రెవెన్యూ అధికారుల అనుసరిస్తున్న నిర్లక్ష్యం వల్ల భూ సమస్యల పేరుకు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధిగా వ్యవహరించి వారసత్వ భూములను సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూములను రైతుల పేరిట వన్ బి రికార్డులలో నమోదు చేసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు లేని పేదలు గత ఐదు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారని వారందరికీ ప్రభుత్వం ప్రకటించిన మూడు సెంట్లు వంతున ఇంటి స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 1,2,3 తేదీల లో నెల్లూరులో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలకు సత్యవేడు నియోజకవర్గంలోని ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, కమిటీ సభ్యులు వరలక్ష్మి, శంకరయ్య, వెంకటేశులు, మునిశంకర్ , రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్

సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -కోట : రెవెన్యూ సదస్సుల్లో ప్రతి ఒక్కరూ భూ సమస్యలను పరిష్కరించు కోవాలని కోట తహశీల్దారు కే. జేజేరావు అన్నారు. కోట మండలం చిట్టెడు పంచాయతీ పరిధిలోని సచివాలయ కేంద్రం వద్ద టిడిపి నాయకులు చంద్రగిరి చంద్రశేఖర్, యాకసిరి చిన్నయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి కోట తహశీల్దారు కే జెజెరావు, ఆర్ఐ మధులత, మండల సర్వేయర్ గోపిరెడ్డి లు హాజరయ్యారు. ఈ సదస్సులో భూ సమస్యలపై పలు అర్జీలు స్వీకరించారు. ఇళ్ల స్థలాలు కావాలని పలువురు అధికారులకు అర్జీలను అందించారు. ఆక్రమణలో భూమిని అర్హులైన పేదలకు ఇవ్వాలని పలువురు తహశీల్దారుకు వినతి పత్రం అందించారు. చిట్టేడు టిడిపి మాజీ ఎస్‌సి సెల్ నాయకులు యాకసిరి చిన్నయ్య మాట్లాడుతూ చిట్టేడు వజ్జవారి పాలెం గ్రామ రెవెన్యూలో 18వ సర్వే నంబర్‌లో సుమారు 30 ఎకరాలు ఆక్రమణకు గురైందని, ఆ భూమిని పరిశీలించి అర్హులకు అందించాలని తహశీల్దారుకు వివరించారు. ఈ విషయం గతంలోనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సుకు ఎంపిటీసీ కుడుముల అంకమ్మ, సర్పంచ్ కుడుముల రాఘవయ్య గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, చిరంజీవి, గ్రామ ఇన్‌ఛార్జి సర్వేయర్ మహేష్, రెవెన్యూ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: మండలంలోని సికేపల్లి పంచాయతీ కాలేపల్లి శ్రీ కోదండ రామస్వామి ఆలయ భూములను దురాక్రమం నుండి రక్షించండి..' అంటూ గ్రామస్తులు రెవెన్యూ సదస్సులో తహశీల్దారు వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. శనివారం రెవెన్యూ అధికారులు కాలేపల్లి లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయా నికి 1956లో సర్వేనెంబర్ 189/2 లో 2 ఎకరాల 12 సెంట్లు భూమిని గుడి మాన్యంగా రెవెన్యూ రికార్డు లలో నమోదు చేశారు. ఆ భూములను రైతులకు కౌలు కిచ్చి, వచ్చిన ఆదాయంతో దేవాలయంలో ధూప దీప నైవేద్యాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించే వారిమని గ్రామానికి చెందిన లోకనాథరెడ్డి, వాసు దేవరెడ్డి, దొరసామిరెడ్డి కోదండ రాముని భూములను ఆక్రమించుకొని గ్రామస్తులను ఆ భూముల్లోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ రికార్డుల్లోనూ కోదండ రామాలయానికి చెందిన భూములుగా రికార్డుల్లో ఉన్నాయని, దేవాదాయ శాఖ రికార్డుల్లో కూడా కోదండ రామాలయానికి చెందిన భూమిగా నమోదయింది. రెవెన్యూ అధికారులు స్పందించి దురాక్రమణ నుండి ఆ భూములను ఆలయ కమిటీకి స్వాధీన పరచాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నేత బాదూరు కోటేశ్వర్ రెడ్డి రాయల చెరువు మునక ప్రాంతంలో ఉన్న నిర్వాసితులకు సురక్షితమైన ప్రాంతంలో ఇంటి పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, మురళీ రెడ్డి, నాదముని రెడ్డి, కుప్పారెడ్డి , ఆర్ ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు రాజశేఖర్, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వినతి పత్రాలు స్వీకరిస్తున్న తహశీల్దారు

గంటలోపే పాస్ బుక్ మంజూరు

లబ్ధిదారుడికి పట్టాదారు పాస్ పుస్తకం అందిస్తున్న రెవెన్యూ అధికారులు

యర్రావారిపాలెం: మండల తహశీల్దారు కార్యాలయంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దీర్ఘకాలకంగా పాసు బుక్‌ల కోసం నెలలు తరబడి తిరుగుతున్న రైతులకు దరఖాస్తు చేసుకున్న గంటలోపే పాస్‌బుక్ మంజూరు చేసినట్లు తహశీల్దారు పరమేశ్వరస్వామి తెలిపారు. మండలంలోని రైతులు తమ భూమి పాసు బుక్ కోసం మ్యుటేషన్ దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు గంటలోపే ప్రభుత్వ ఆదేశానుసారం పాస్‌బుక్‌లు మంజూరు చేసి ఆన్‌లైను లో భూమి వివరాలను నమోదు చేస్తామని తెలిపారు. మండలంలో ప్రతి పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో రైతులు ఇచ్చిన భూ సమస్యల అర్జీలను పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులు దీనిపై హర్షం వ్యక్తం చేసి తహశీల్దారుకు ధన్యవాదాలు తెలిపారు.

బంజారాల సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి : ఇన్‌ఛార్జి విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : బంజారాల సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని ఎస్వీయు ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావు పేర్కొన్నారు. బంజారా జన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆధ్వర్యంలో మూడే హరి చౌహన్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పదని వారు చరిత్రలోనే ఎన్నో శతాబ్దాల క్రితం యుద్ధ వీరులని, మహారాజులని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తి భావ భరితమైన నాటకాలు, తరిగొండ వెంగమాంబ జీవిత చరిత్ర, అన్నమయ్య సంకీర్తనలు, భరతనాట్యం, కూచిపూడి, సాంస్కృతిక జానపద కళలు, మహాభారతం మొదటి ఘట్టం, కోలాటాలు, భజనలు మొదలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారా జనసంగ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ నాయక్, తిరుపతి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ ,వినోద్ రాథోడ్, ప్రియాంక ,హేమంత్, నాగేంద్ర, కిషోర్ నాయక్, లలిత, హరి నాయక్, లచ్చి రామ్ నాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

వైసిపి ధర్నా హాస్యాస్పదం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై లక్షల కోట్ల రూపాయలు భారం వేసి విద్యుత్ సంస్థను నష్టాల పాలు చేసిన ఘనత వారిదేనని, అయితే తమ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచిందని వైసీపీ నాయకులు ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఎద్దేవా చేశారు. గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల భారం మోపిందని అసత్య ప్రచారాలు చేస్తూ వైసిపి నాయకులు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా వుందన్నారు. ఆనాడు చంద్రబాబు నేతృత్వంలో 20వేల మెగా వాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో రైతు లకు, బడుగు బలహీన వర్గాలకు ఉచిత విద్యుత్ వైసిపి ప్రభుత్వం ఇవ్వగలి గిందని గుర్తు చేశారు. జల జీవన్ మిషన్‌లో గూడూరు నియోజకవర్గ పరిధిలో 20 కోట్ల రూపాయలు అవినీతి చోటు చేసుకుందని ఎమ్మెల్యే ఆరోపిం చారు. వాకాడు మండలంలో కేంద్ర ప్రభుత్వ నిధులలో అవినీతి చోటుచేసు కుందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకూ విద్యుత్ ఛార్జీలు పెంచనేలేదని, జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాల కారణంగా విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, ప్రజలపై భారాన్ని తగ్గించడానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో కనీసం ఒక్క మెగావాట్ కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేదన్నారు. విద్యుత్ వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులు కోల్పోయారన్నారు. విద్యుత్ ఛార్జీలపై జగన్ మోహన్ రెడ్డి ధర్నాలకు పిలుపు నివ్వడం మరో తుగ్లక్ చర్య అని మండిపడ్డారు.

తిరుపతి(మంగళం): తన సొంత లాభం చూసుకుని రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపింది మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరపాలక సంస్థ 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సి మునికృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. గన్ హయాంలో చేసిన పనుల కారణంగానే ప్రస్తుతం విద్యుత్ భారాలు వేస్తున్నారన్నారు. దీనిపై ధర్నాలు చేయడం విడ్డూరంగా వుందన్నారు. ఈ సమావేశంలో కరాటే చంద్ర, సుబ్బు యాదవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్

రిపబ్లిక్ పరేడ్ కు గిల్ క్రిస్ట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వచ్చే ఏడాది జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలకు స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థి ఎన్సీసీ కేడెట్ టి. గిల్ క్రిస్ట్ ఎంపికయ్యారు. రిపబ్లిక్ దినోత్సవ వేడుకలలో భాగంగా పరేడ్ లో పాల్గొనేందుకు ఎన్సీసీ 29 ఆంధ్ర బెటాలియన్ నిర్వహించిన ఎంపిక పరీక్షలో గిల్ క్రిస్ట్ అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ నరసింహ వర్మ తెలిపారు. ఎన్సీసీ అధికారి డాక్టరు సి బాపనయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు టి గంగారామ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టరు పి సత్యనారాయణ రెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ కె సాయి వెంకటేష్, తదితర అధ్యాపకులు గిల్ క్రిస్ట్ కు అభినందనలు తెలిపారు.

పశువైద్య కళాశాలలో యూత్ పార్లమెంటు

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక పశువైద్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యూత్ పార్లమెంటును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి జగపతిరామయ్య మాట్లాడుతూ విద్యార్థులకు యువ మంతన్ యూత్ పార్లమెంట్, యుఎన్‌ఒ మోడల్ ను నిర్వహించామన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో చర్చగోష్ఠిలో భారతదేశ పశు వైద్యం, వ్యాధి నివారణ మౌలిక అవసరాల ఆవశ్యకతను గురించి చర్చించడంతోపాటు పశు వైద్యంతో పాటు గ్లోబలైజేషన్ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాసరావు అమరావతి, వెంకటేశ్వర్లు, రాజా, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వమిత్వ'పై శిక్షణ

ప్రజాశక్తి -కోట : స్థానిక ఎంపిడివో కార్యాలయంలో స్వమిత్వపై కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్ లు, సచివాలయం సర్వే టీమ్‌లకు శనివారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ వెంకటరమణ, ఎంపిడిఓ వేణులు మాట్లాడుతూ స్వమిత్వ కార్యక్రమానికి సంబంధించిన విధి, విధానాలు, వాటి లక్ష్యాలను వివరించారు.

క్రైం న్యూస్

దూసుకెళ్లిన కంటైనర్

- ఆలయం వద్ద ఘటన - మహిళకు గాయాలు- తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- వరదయ్య పాలెం: కంటైనర్ స్థానిక కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంపైకి దూసుకెళ్లిన ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. రద్దీగా వున్న ఆ ప్రాంతంలో పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్న ఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మండల కేంద్రమైన వరదయ్య పాళ్యం శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంపైకి కంటైనర్ శుక్రవారం అర్ధరాత్రి దూసుకెళ్లింది. అదే సమయానికి ఆలయం వెలుపల ముగ్గులు వేసి సామగ్రిని ఆలయం లోపల భద్రపరిచేందుకు వెళ్లారు. ఇంతలో కంటైనర్ ఒక్కసారిగా ఆలయంపైకి దూసుకు వెళ్లింది. అక్కడే వున్న గీతకు తీవ్ర గాయాలయ్యాయి. కంటైనర్ నడుపుతున్న డ్రైవర్ మద్యం మత్తులో వుండటమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు. పక్కనే పోలీసు స్టేషన్ వుండటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోపు వాహన డ్రైవర్ పరారయ్యాడు. గాయాలపాలైన మహిళను వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెంగల్ పట్టు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

మంగళం వాసులకు తీవ్రగాయాలు, ఒకరు మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తమిళనాడు చెంగల్ పట్టు వద్ద చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో మంగళంకు చెందిన ఓ మహిళ మృతి చెందగా పలువురు గాయపడ్డారు. స్థానిక మంగళంకు చెందిన కొందరు భక్తులు ఓం శక్తి మాల ధరించి మేల్ మరవత్తూర్ అమ్మవారి దర్శనానికి వెళ్లారు. అక్కడి నుండి మహాబలిపురం వెళుతుండగా వారి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మంగళం గ్రామ పంచాయతీ చంద్రబాబు కాలనీకి చెందిన జి. చంద్రిక (22) చనిపోయింది. మిగిలిన 9 మంది చెంగమ్మ (41), రచన (22), దియాన్షి (2), అంజలి (42), మహిత (3), హరిబాబు (42), ధరణి (21), ఆరాధ్య (2), దినేష్ (5) తీవ్ర గాయాలపాలై చెంగల్ పట్టు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో అంజలి, ధరణి, రచనకు కాళ్లు విరిగిపోయాయి, 5 సంవత్సరాల దినేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నై ఎగ్మోర్ హాస్పిటల్ కు మెరుగైన చికిత్స కోసం తరలించారు. ఈ ఘటనపై ఈ1 మామలపురం పోలీస్ స్టేషన్ లో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు కేజీల గంజాయి పట్టివేత

నిందితులు అరెస్ట్

పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం : 6 కేజీల గంజాయి తరలిస్తున్న నిందితులను చాకచక్యంగా స్థానిక ఎస్ఐ మల్లికార్జున్ అరెస్టు చేశారు. గత కొంతకాలంగా మండలంలో గంజాయి రవాణా కు సంబంధించి అనేక మార్లు ఫిర్యాదు అందుకున్న స్థానిక ఎస్ఐ పక్కా సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. శనివారం కారిపాకం గిరిజన కాలనీ సమీపంలో ఉన్న రైస్ మిల్ వద్ద గంజాయి రవాణా జరుగుతోందన్న సమాచారం అందుకున్న వెంటనే తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో అన్నవరానికి చెందిన రాజా గంజాయిని తీసుకొని రాగా తడ గ్రామానికి చెందిన విక్కి అరసు గంజాయిని వాడడంతో పాటు స్థానికంగా విక్రయించడం గమనార్హం. వీరికి గుమ్మడి పూడి కి చెందిన అజిత్ కుమార్ తాడ గ్రామానికి చెందిన నరేంద్ర వెట్టి సురేష్ సహకరించినట్లు పోలీసులు విచారణ తెలిసింది. ఆరు గురు నిందితుల నుండి 6 కేజీల గంజాయి విలువ రూ.72,000 వరకు ఉండవచ్చని అంచనా. ఐదు సెల్ ఫోన్లు, 50 వేల నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో పాల్గొన్న సిబ్బంది సాయిబాబా సుబ్రహ్మణ్యం హరిప్రసాద్ గణేష్ ఉదయ్ కుమార్ లను పోలీసులు ప్రశంసించారు.

రిసోర్స్ పర్సన్‌ను విధుల్లోకి తీసుకోవాలి

మెప్మా పీడీకి సిఐటియు నాయకుల వినతి

మెప్మా పీడీకి వితిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మెప్మాలో రిసోర్స్ పర్సన్ గా పనిచేస్తున్న ధనమ్మను అకారణంగా తొలగించారని, ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మెప్మా పీడీ రవీంద్రకు సిఐటియు నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భం గా సిఐటియు నాయకులు మాట్లాడుతూ అకారణంగా రిసోర్స్ పర్సన్ ధనమ్మను తొలగించడం బాధాకరమన్నారు. గత ఎనిమిది నెలలుగా ఆమె జీవనోపాధి కోల్పోయి, కుటుంబం గడవడం కష్టంగా ఉందన్నారు. ఇకనైనా జిల్లా పీడీ విచారించి ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జోగి శివకుమార్, సురేష్, పుట్ట శంకరయ్య, రిసోర్స్ పర్సన్ ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక గేట్ పుత్తూరులో గిరిజన గురుకుల పాఠశాలను జిల్లా గిరిజన నోడల్ అధికారి బి సూర్యనారాయణ. శనివారం పంపిణీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు సమితి ద్వారా విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటీరియల్ ద్వారా పోటీ పరీక్షలుకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు అందే విధంగా దాతలు ద్వారా ఏర్పాటు చేస్తున్నామని గురుకులాల పరిరక్షణ సమితి సిద్ధమైంది. విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకొని మంచి మార్కులు సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సమితి నాయకులు ఇరువారం చిరంజీవి, శివ, ఉపాధ్యాయులు పిల్లలు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్స్‌కు అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పురపాలక కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడర్స్‌కు శనివారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెప్మా పీడీ రవీంద్ర, పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణ ప్రాంతాలలో నివసించే వారికి ఇంటిలో వివిధ రకాల అవసరాలను అందుబాటులో ఉంచేందుకు మెప్మా, ప్రభుత్వం ద్వారా శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటి మిషన్ మేనేజర్ పెంచలయ్య, ప్రమీల, చందన, లత లు పాల్గొన్నారు.

ఉషశ్రీకి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూలోని వాణిజ్యశాస్త్రం విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి కె ఉషశ్రీ కి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులురెడ్డి పర్యవేక్షణలో "ప్రైమరి అగ్రికల్చరల్ కో–పరేటివ్ సొసైటిస్ అండ్ ఫార్మ్ ఫైనాన్స్ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ ' అన్న అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇందుకు ఆమెకు డాక్టరేట్ ను ప్రదానం చేశారు. పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

కామాక్షయ్య సేవలు మరువలేనివి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -నాగలాపురం: ఉపాధ్యాయ వృత్తిలో కామాక్షయ్య చేసిన సేవలు మరువలేనిదని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కొనియాడారు. గత నెలలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కామాక్షయ్య కు ఆత్మీయ సన్మాన సభను నాగలాపురం ఎంఈఓ బాబయ్య అధ్యక్షతన శనివారం స్థానిక వర్తక వ్యాపార కళ్యాణమండపం లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు మండల అధ్యక్షులు ఇలంగోవ రెడ్డి, నాగలాపురం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ ప్రేమ సెల్వ కుమార్, సుబ్రమణ్యం రాజు, మాజీ ఎంపీపీ మురళి,పార్తిబన్, రాజశేఖర్ యాదవ్ డాక్టర్డి ఏ డి శేషాద్రి, వేం బాకం సర్పంచ్ తెన్నారసు ,ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం